క్లుప్తంగా

650 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు మంజూరు

శిరివెళ్ల: జీలుగు విత్తనాల కోసం మండలంలో 1,345 మంది రైతులు రైతు భరోసా కేంద్రాలలో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఏఓ సుధాకర్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వం మండలానికి 650 క్వింటాళ్ల విత్తనాలను మంజూరు చేసిందన్నారు. 50 శాతం సబ్సిడీపై త్వరలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. అలాగే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, వరి విత్తనాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పంట నష్టం జాబితా సిద్ధం

ఉయ్యాలవాడ : ఈ ఏడాది రబీ సీజన్‌లో పప్పు శనగ సాగు చేసి ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతుల జాబితాను ప్రభుత్వ ఆదేశాల మేరకు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 7,661 హెక్టార్లలో 6,517 మంది రైతులు పప్పు శనగ పంట సాగు చేశారన్నారు. దిగుబడులు తగ్గిన రైతుల పొలాల్లో పంట కోత ప్రయోగాల ద్వారా గుర్తించామన్నారు. ఈ మేరకు పరిహారం కోసం రూ.7.63 కోట్లు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు ఏఓ స్పష్టం చేశారు.

శరవేగంగా సీసీరోడ్డు నిర్మాణ పనులు



పుసులూరులో జరుగుతున్న రోడ్డు పనులు

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం పుసులూరు గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నంద్యాల నుంచి గోస్పాడు మండలం ఎస్.కూలూరు గ్రామం వరకు రూ.4.75 కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో బీటీరోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పుసులూరు గ్రామం ప్రారంభం నుంచి చివరి వరకు సీసీరోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఓవైపు రోడ్డు పనులు పూర్తిచేసిన అధికారులు మరోవైపు పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. గుంతలమయం అయిన రోడ్డు బాగుపడుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ : ఫ్యామిలీ డాక్టర్ సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యాలవాడ పీహెచ్‌సీ డాక్టర్ వెంకటసుబ్బయ్య సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని తుడుమలదిన్నె గ్రామంలో ప్రజలకు సిబ్బందితో కలిసి వైద్య పరీక్షలు చేశారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సూత్రాలు వివరించి జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా డాక్టర్ రోగులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన



విశేష అలంకరణలో కాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళికాంబ మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో అభిషేకించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. వివిధ రకాల పూలతో పూలంగి సేవ జరిపించారు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం అనంతరం 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

రుద్రవరం: ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని చిన్నకంబలూరు గ్రామానికి చెందిన శివమల్లేశ్వరి (36) పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందింది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పొలం కౌలు తీసుకునే విషయంలో రెండు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. క్షణికావేశానికి లోనైనా ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు పురుగుల మందు తాగింది. ఆమెను హుటాహుటిన నంద్యాలలోని ఓ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కొండెక్కిన ఫలాలు

- సామాన్యుడికి అందనంత ఎత్తుల్లో పండ్ల ధరలు
- వర్షాభావంతో తగ్గిన దిగుబడులు
- డిమాండ్ ఏర్పడడంతో పెరిగిన ధరలు

నంద్యాల(న్యూటౌన్): భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. వడగాల్పులు, ఉక్కపోతకు ప్రజలు అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో నిస్సత్తువ ఆవరించకుండా పోషక విలువలున్న తాజా పండ్లు తినడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. కానీ మార్కెట్‌లో ఆపిల్, దానిమ్మ, పైనాపిల్, కమలా, ద్రాక్ష, బొప్పాయి, అరటిపండు.. పండేదైనా సరే ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎక్కి కూర్చున్నాయి. మండుతున్న ఎండలకు తగ్గట్టే మార్కెట్‌లో పండ్ల ధరలు సైతం సెగలు పుట్టిస్తున్నాయి. ఏ రకమైన పండ్లు కొనాలన్నా వందల్లో రేటు పలుకుతుండడంతో కొనుగోలుదారులకు షాక్ తప్పడం లేదు.

పెరిగిన వినియోగం

వ్యక్తిగత ఆరోగ్యం కోసం, పూజా కార్యక్రమాలు, బంధువుల ఇంటికి, పరామర్శలకు వెళ్లినప్పుడు పండ్లు కొనుగోలు చేస్తుంటారు. పోషక విలువలు ఎక్కువగా ఉన్న తాజా పండ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందని వైద్యులు పదేపదే సూచిస్తున్నారు. పైగా కరోనా తర్వాత పండ్ల వినియోగం పెరిగింది. కాని వేసవిని సాకుగా చూపుతూ డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు రేట్లు అమాంతంగా పెంచేస్తున్నారని కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాస సెంటర్, బొమ్మలసత్రం, గాంధీచౌక్, నూనెపల్లె, టెక్కె,



విక్రయాలకు ఉంచిన పండ్లు

సాయిబాబానగర్ తదితర ప్రధాన రహదారుల్లోని పండ్ల దుకాణాల్లో ఎక్కువగా వ్యాపారాలు జరుగుతుంటాయి.

మార్కెట్‌లో మంట

మార్కెట్‌లో దేశ, విదేశీ రకాల పండ్లు అందుబాటులో ఉన్నా వాటి ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పరిమాణాన్ని బట్టి డజను యాపిల్ రూ.250 నుంచి రూ.270, దానిమ్మ రూ.200 నుంచి రూ.250, సుగంధ అరటి పండ్లు రూ.60 నుండి రూ.70 వరకు, నల్ల ద్రాక్ష కేజీ రూ.120 నుంచి రూ.150, పుచ్చకాయ సైజును బట్టి రూ.50 నుంచి రూ.100, బొప్పాయి కేజీ రూ.50, డ్రాగన్ ఫ్రూట్ ఒక్కోటి రూ.100, నేరేడు పండ్లు పావుకేజీ రూ.100లకు విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో పండ్ల ధరలు అందుబాటులో లేక వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా జ్యూస్ సెంటర్ల ద్వారా పండ్ల వినియోగం అధికంగా పెరగడంతో ధరలకు రెక్కలు వచ్చినట్లు పండ్ల వ్యాపారులు చెబుతున్నారు.

సామాన్యులకు అందుబాటులో లేవు



ప్రస్తుతం పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. ఆఖరికి వేసవిలో దొరికే పుచ్చకాయ, బొప్పాయి ధరలు సైతం పెరిగిపోయాయి. వేసవిలో ఫ్రూట్ జ్యూస్‌లకు డిమాండ్ ఉండడంతో పండ్ల ధరలు పెరుగుతున్నాయి.

–జయన్న, నంద్యాల

ఖర్చులు ఎక్కువ అయినందునే ధరలు పెరిగాయి



పండ్లు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. వేసవి కావడం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దిగుబడి తగ్గి డిమాండ్ పెరిగింది. దీంతో ధరలు అమాంతం పెరిగాయి. ఖర్చులు విపరీతంగా పెరగడంతో దానికి అనుగుణంగానే అమ్మకాలు జరుపుతున్నాం.

–పెద్దయ్య, పండ్ల వ్యాపారి, నంద్యాల

మిడుతూరులో ధార్మిక కార్యక్రమాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న జయదేవానంద స్వామిజీ

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థాన ధార్మిక (ధార్మిక ప్రవచనాలు, భజనలు, గోపూజ) కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వహకులు మల్లు వెంకటరెడ్డి మంగళవారం తెలిపారు. మంగళవారం స్థానిక ఆలయంలో శ్రీ జయదేవానందస్వామిజీ చేతుల మీదుగా ధార్మిక కార్యక్రమాల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం శ్రీమద్రామాయణం, బుధవారం మహాభారతం, గురువారం భగవద్గీతలపై జయదేవానందస్వామిజీ ధార్మిక ప్రవచనాలు, శుక్రవారం గో పూజ, కుంకుమార్చన, ప్రతి రోజు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామ్మోహన్, గొల్ల రాముడు, రామకృష్ణారెడ్డి, దాలు చిట్టిబాబు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

నంద్యాల టౌన్: రుతుక్రమ సమయంలో కౌమార బాలికలు, మహిళలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని జిల్లా వైద్యఆరోగ్యాధికారి వెంకటరమణ సూచించారు. మంగళవారం ప్రపంచ రుతుక్రమ ఆరోగ్య, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా సర్వజన ఆస్పత్రిలోని మాతా శిశు రక్షణ కేంద్రంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ జీవితంలో రుతుక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కౌమార బాలికలు ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియచేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. సానిటరీ నాప్కిన్ ఉపయోగిస్తూ ఇన్ఫెక్షన్లకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండడంతో పాటు గర్భాశయ క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ఉంటామన్నారు. అదే



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

విధంగా రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ శారదాబాయి, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మజ, నోడల్ ఆఫీసర్ కాంతారావు నాయక్, వైద్యులు రాజ్యలక్ష్మి, రేఖా రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత నిధులు విడుదల

- జిల్లాలో 97,254 మంది మహిళలకు రూ.698.92 కోట్ల లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న వైఎస్సార్ చేయూత నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్ల పాటు ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. నాల్గో ఏడాది వైఎస్సార్ చేయూత కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి నెలలో బటన్ నొక్కినా అనివార్య కారణాలతో విడుదల కాలేదు. ఏటా ఇదే సమయంలో విడుదల చేసే కార్యక్రమం అయినందున ఎన్నికల ముందు అనుమతి కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినా ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వలేదు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో వైఎస్సార్ చేయూత కింద రూ.182.35 కోట్లు మహిళల ఖాతాలకు జమ అవుతున్నాయి. మంగళవారం కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల బ్యాంకు ఖాతాలకు చేయూత నిధులు విడుదలయ్యాయి. వంద శాతం నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. నాలుగేళ్లలో రికార్డుస్థాయిలో చేయూత కింద రూ.698.92 కోట్లు ప్రభుత్వం అందజేసింది.

97,254 మంది మహిళలకు లబ్ధి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ చేయూత కింద ఆర్థిక తోడ్పాటును అందించింది. ఈ పథకం కింద 2022–23 వరకు రూ.178.10 కోట్లు అందించింది.. 2023–24 సంవత్సరానికి సంబంధించి రూ.182.35 కోట్లు విడుదల అవుతున్నాయి. ఈ పథకం కింద ఎస్సీ మహిళలు– 24,333, ఎస్టీ మహిళలు 3096, బీసీలు 67,329, మైనార్టీలు 2373, క్రిస్టియన్ మహిళలు 123 మంది ప్రయోజనం పొందుతున్నారు.

పురాతన దిగుడుబావి పూడ్చివేత

పగిడ్యాల: స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయం పక్కన ఉన్న అతి పురాతన దిగుడుబావిని పూడ్చివేశారు. 14వ శతాబ్దంలో పగిడ్యాలలో పగడాలు రాశులుగా పోసి విక్రయించే వారని అందుకే ఈ గ్రామానికి పగిడ్యాల నామకరణం వచ్చినట్లు ప్రతీతి. అప్పట్లో సాళువ నరసింహరాయలు వేసిన శిలాశాసనాలు నేటికి గ్రామంలోని ఊరవాకిలి వీరభద్రస్వామి దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, కోట వీధి శివాలయం వద్ద ఉన్నాయి. ఈ పురాతన బావిని కూడా అప్పట్లోనే నిర్మించి ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు. కాలక్రమేణా దిగుడుబావులు నిరుపయోగంగా మారి అందులో చెత్తాచెదారం వేయడంతో దుర్గంధం వెదజల్లి దేవాలయ పవిత్రతకు భంగం కలుగడంతో ఈఓ ఎస్



మట్టితో పూడ్చిన పురాతన బావి

రామలింగారెడ్డి సూచన మేరకు గ్రామపెద్దలు మూడు రోజులుగా శ్రమించి మట్టితో బావిని పూడ్చివేయించారు. అయితే ఎంతో చరిత్ర కలిగిన దిగుడుబావిని పూడ్చివేయడం పట్ల ప్రజల్లో భిన్న స్వరాలు వినిపిస్తుండడం గమనార్హం.

సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐలు ప్రకాష్‌కుమార్, విజయభాస్కర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని నీలిషికారిపేటలో నాటుసారా తయారు స్థావరాలపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. 500 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. 9 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా నాటుసారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొంది నాటుసారా తయారుకు స్వస్థి పలకాలని చెప్పారు. పద్ధతులు మార్చుకోకపోతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపడం ఖాయమన్నారు. 9 మోటారు బైక్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు లక్ష్మీనారాయణ, నాగార్జున, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



సారా స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు

ఉపాధి పనుల పరిశీలన

దొర్నిపాడు: రైతులు పనులు పూర్తి కావడంతో ప్రస్తుతం మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతి రోజు 1750 నుంచి 2వేల వరకు ఉపాధి కూలీలు పనులకు హాజరవుతున్నట్లు ఈసీ సోమశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు, దొర్నిపాడు, గుండుపాపల బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కొలతల మేరకే కూలి ఉంటుందన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. కూలి సొమ్ము వెంటనే కూలీల వ్యక్తిగత బ్యాంకుఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పారు.

బావిలోపడి బర్రె, దూడ మృతి

కొత్తపల్లి: గ్రామ శివారుల్లోని ఓ వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు బర్రె, దూడ పడి మృతి చెందిన ఘటన మంగళవారం మండల పరిధిలోని జి.వీరాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన స్వామిదాసు యేసురత్నం, జయమ్మలు సంవత్సరం క్రితం ఓ బర్రెను కొనుగోలు చేశారు. దానికి ఓ ఏడాది వయస్సు ఉన్న దూడా కూడా ఉంది. వీటిని మేతకోసం మూడురోజుల క్రితం గ్రామశివారుల్లో వదిలారు. రాత్రి ఇంటికి రాకపోవడంతో గ్రామశివారుల్లో, పొలాలు, చుట్టుపక్కల గ్రామాలలో వెతికినా ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం గ్రామ శివారుల్లోని జాంగిరేల్ బాయిలో తల్లి బర్రె, దూడ కళేబరాలు నీటిపై తేలాయి. అటుగా వెళ్తున్న వ్యక్తులు చూసి వారికి సమాచారం ఇచ్చారు. నీరుతాగేందుకు వెళ్లి ప్రమాద వశాత్తు అందులోనే పడి చనిపోయి ఉంటాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. సుమారు రూ.70వేలు నష్టం వాటిల్లిందని యజమాని వాపోయాడు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలో ఈనెల 26న భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్ట్ చేసినట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. వడ్డె రమణయ్య భవన నిర్మాణ కార్మికుడు. తరచూ మద్యం సేవించి భార్య సుగుణమ్మతో గొడవ పడేవాడు. ఈక్రమంలో కుమారులతో పాటు కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు పంపడంతో అదే వీధిలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఒక్కడే ఉంటున్నాడు. పక్కన ఉంటున్నా ఇంటి నుంచి బయటకు పంపించారనే ఉద్దేశంతో భార్యతో గొడవ పడుతూనే ఉండేవాడు. ఇంటి ముందు వీధిలో మంచంపై నిద్రిస్తున్న భార్యను తల,ముఖంపై పదునైన ఆయుధంతో విచక్షణా రహితంగా నరకడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అంకిరెడ్డిపల్లె సమీపంలోని కాశీనాయన ఆశ్రమం వద్ద ఉన్న రమణయ్యను అరెస్ట్ చేశారు. కోవెలకుంట్ల మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో కర్నూలు జిల్లా జైలుకు తరలించామని సీఐ చెప్పారు.

ఐటీఐలో చేరడానికి దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండేళ్ల వ్యవధి ట్రేడులు ఎలక్ట్రిషియన్ – 20, ఫిట్టర్ –20, ఎలక్ట్రానిక్ మెకానిక్ –24, ఏడాది వ్యవధితో కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ –48, వెల్డర్ –40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ చేరడానికి 10వ తరగతి పాస్, వెల్డర్‌కు మాత్రం 10వ తరగతి పాస్, ఫెయిల్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9849648456 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలు నిషేధం

- రాజకీయ పార్టీల శ్రేణులకు టపాసులు అమ్మితే చర్యలు
- డీఎస్పీ షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ : ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని బాణాసంచా దుకాణాలను డీఎస్పీ తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ శ్రేణులకు బాణాసంచా విక్రయించరాదన్నారు. విక్రయించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు రోజు ఉదయం నుంచి 6తేదీ రోజు రాత్రి వరకు జిల్లా అంతా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురి కంటే ఎక్కువ మంది గుంపుగా కనిపించరాదన్నారు. గెలిచిన అభ్యర్థులు టపాసులు కాల్చడం, అభినందన సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం, సోషల్ మీడియాలో పోస్టులు చేయడం నిషేధమన్నారు. ఎవరైనా హద్దుమీరితే ఉపేక్షించేది ఉండదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయన వెంట సీఐ రమేష్‌బాబు, ఎస్ఐలు నగీన, వెంకటరెడ్డి ఉన్నారు.



ఆళ్లగడ్డలోని బాణాసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐ రమేష్‌బాబు

ఇరుకైన రహదారితో ఇక్కట్లు



ఆక్రమణలతో ఇరుకుగా మారిన రహదారి

నంద్యాల(అర్బన్): ఆక్రమణలతో ప్రధాన రహదారి కుచించుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని నంద్యాల మండలం చాపిరేవుల గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం ప్రారంభం నుంచి రహదారి ఇరువైపులా ఆక్రమణలకు గురికావడంతో 30 అడుగులు ఉన్న రహదారి 15 అడుగులకు కుచించుకుపోయింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారి మొత్తం వంకర టింకరుగా ఉండడంతో పెద్ద వాహనాలు దూరం నుంచే హారను కొడుతూ నిలుపుకోవాల్సి వస్తోంది. ఆటోలు సైతం ఎదురైనప్పుడు ట్రాఫిక్ మొత్తం నిలిచిపోతోంది. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ కాలువను ఇళ్ల యజమానులు ఆక్రమించుకోవడంతో మురుగు నీరు ప్రధాన రహదారిపై పారుతూ బాటసారులను తీవ్ర అసౌకర్యాలకు గురిచేస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలనుకున్నా స్థానికులు అడ్డుపడుతుండడంతో ఇక్కట్లు తప్పడం లేదని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

చాగలమర్రి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఎంఈఓలు టి. అనురాధ, సయ్యద్ న్యామతుల్లాలు నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులకు మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పీహెచ్‌సీ డాక్టర్ షేక్ ఇమ్రాన్ భోజనం తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ప్రాముఖ్యత తదితర అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ వందశాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం భుజించేలా రుచిగా తయారు చేయాలని ఏజెన్సీలకు సూచించారు. తదనంతరం మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులకు వంటల పోటీలు నిర్వహించిన మాస్టర్ ట్రైనర్ ఆశాజ్యోతి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కోటయ్య, సీఆర్‌పీలు అమీర్‌ఖాన్, వెంకటనారాయణ, ఖాశీం, కొండయ్య, విజయ కుమారి, ఏజెన్సీల సభ్యులు, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ న్యామతుల్లా

పెరిగిన ఆలయ ఆదాయం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూములు కౌలుకు ఇచ్చేందుకు నిర్వహించిన బహిరంగ వేలంలో ఆలయానికి రూ.97,700 ఆదాయం పెరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని సాదుకొట్టం గ్రామంలోని శ్రీరాముల దేవస్థానంలో ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, ఏ కోడూరు గ్రూపు టెంపుల్స్ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయానికి సంబంధించి మొత్తం 89.47 ఎకరాలు కౌలుకు ఇచ్చేందుకు బహిరంగవేలం జరిగింది. 63.52 ఎకరాలను కౌలుకు పాటదారులు దక్కించుకోగా, కౌలు ద్వారా మొత్తం రూ.3,15,600 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. అయితే గతేడాది కంటే రూ.97,700 అదనపు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహేష్, సిబ్బంది ప్రసాద్, రమేష్ బాబు రైతులు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మల్లికార్జునరెడ్డి

ఆళ్లగడ్డ : ఓట్ల లెక్కింపు సందర్భంగా కేంద్రాల్లో ఉండే రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పక పాటించాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల తరుపున కౌంటింగ్ ఏజెంట్లుగా హాజరయ్యే వ్యక్తులు కౌంటింగ్ కేంద్రంలో నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించినా, ఉల్లంఘనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయం ఏజెంట్లకు అందరికీ తెలియపరచాలని సూచించారు. ఎలాంటి కేసులు లేని వారిని మాత్రమే ఏజెంట్‌గా నియమించడం జరుగుతుందన్నారు. అనంతరం పోలీస్ అధికారులు, తహసీల్దార్‌లతో పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్, ఈవీఎంల కౌంటింగ్‌పై చర్చించారు. కార్యక్రమంలో డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు ఉన్నారు.

కల్యాణం.. కమనీయం



వేంకటేశ్వర కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లెలో వెలసిన లక్ష్మీగోదా సమేత వాసపురం వేంకటేశ్వరస్వామి, త్రిపుర సుందరి మానస లింగేశ్వరస్వామి ఆలయాల వద్ద ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం లక్ష్మీగోదా సమేత వేంకటేశ్వస్వామి కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల సమక్షంలో పండితులు వేద మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం గావించారు. భక్తులు ఆలయ నిర్వాహకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.